

అంధకారంలో జోలాపుట్టు జలాశయం

అలంకారప్రాయంగా విద్యుత్ స్తంభాలు

- చీకటి పడితే రాకపోకలకు ఇబ్బందులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- జలాశయ సిబ్బంది, పర్యాటకుల భయాందోళన

- వార్త 8వ పేజీలో..

ఎయిడెడ్

వైసీపీ హయాంలో పదుల సంఖ్యలో ఎయిడెడ్ విద్యా సంస్థలు మూత

- ఆస్తులతో సహా అప్పగించండి లేదంటే సిబ్బందిని సరండర్ చేయండి... సాయం మాత్రం చేయలేమంటూ చేతులెత్తేసిన సర్కారు
- గత్యంతరం లేక మూసివేసిన యాజమాన్యాలు



విశాఖలోని సెయింట్ ఆంథోనీ ప్రాథమికోన్నత పాఠశాల

- సొంతంగా నడుపుతున్న మరికొంతమంది...
- పెరిగిన ఫీజుల భారం
- ఉమ్మడి జిల్లాలో పది వేల మంది విద్యార్థులపై ప్రభావం
- వచ్చే ఏడాది మరికొన్ని స్కూళ్లు ఎత్తివేతకు నిర్ణయం

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలం నుంచి నడుస్తున్న ఎయిడెడ్ సంస్థలకు రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఘోరీ కట్టింది. ఎయిడెడ్ సంస్థలకు చెందిన ఆస్తులపై కన్నేసిన ప్రభుత్వం వ్యూహాత్మకంగా వాటిని స్వాధీనం చేసుకునేందుకు యత్నం చింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నడిచే ఎయిడెడ్ కళాశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 80 నుంచి 90 శాతం వరకూ మూతపడ్డాయి. ఆ ప్రభావం వేలాది మంది విద్యా ర్థులపై పడింది. ఎయిడెడ్ విద్యా సంస్థలు మూతపడడంతో స్థోమత ఉన్నవారు ప్రైవేటు పాఠశాలలు/కళాశాలల్లో, లేనివారు సమీపంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరారు. కొంతమంది మాత్రం చదువులకు దూరమయ్యారు.

వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత ఎయిడెడ్ విద్యా సంస్థలను వదిలించుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనికోసం మూడు రకాల ప్రతిపాదనలను యాజమాన్యాల ముందుంచింది. దీంట్లో మొదటిది...ఎయిడెడ్ సంస్థలను ఆస్తులు, సిబ్బందితో సహా ప్రభుత్వానికి అప్పగించడం, రెండు...ఆస్తులను సంబంధిత యాజమాన్యాల పరిధిలో ఉంచుకున్నా ప్రభుత్వం ఇచ్చే జీతాలతో పనిచేసే అధ్యాపక/ఉపాధ్యాయ/ఉపాధ్యాయేతర సిబ్బందిని వెనక్కి అప్పగించడం, మూడు...ప్రభుత్వం నుంచి సాయం ఆశించకుండా యాజమాన్యాలే సొంతంగా నడుపుకోవడం. ప్రభుత్వంతో గొడవ ఎందుకని జిల్లాలో తొలుత కళాశాలల యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే అధ్యాపకులు, సిబ్బందిని ప్రభుత్వానికి సరండర్ చేశారు. ఏవీఎన్, బీవీకే, బుల్లయ్య కళాశాలల యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే అధ్యాపకులను, సిబ్బందిని వెనక్కి పంపేశాయి. ప్రస్తుతం సొంతంగా కళాశాల నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎయిడ్ (సహాయం) రాకపోవడం వల్ల విద్యార్థులు గతం కంటే ఎక్కువ ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మూడు కళాశాలల్లో సుమారు నాలుగు వేల మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. వీరిలో బీసీ/ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని ప్రభుత్వం చెబుతున్నా...చాలామందికి జమ కాలేదు. నా బీసీ...నా ఎస్సీ...నా ఎస్టీ...నా మైనారిటీ...అని తరచుగా సీఎం దీర్ఘాలు తీస్తుంటారు. అయితే ఎయిడెడ్ విద్యా సంస్థలు మూతపడడం వల్ల ప్రధానంగా ఆయా వర్గాలపై తీవ్ర ప్రభావం పడింది. ఏవీఎన్ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ ఎయిడ్‌ను కాదని సొంతంగా నడుపుతోంది. ప్రభుత్వ ఉత్తర్వులను లెక్క చేయకుండా సెయింట్ జోసెఫ్, అనకాపల్లిలో ఎంఎఎల్ కళాశాల యాజమాన్యాలు మాత్రం ప్రభుత్వ ఎయిడ్‌తో బోధన కొనసాగిస్తున్నారు.

దశాబ్దాల చరిత్ర గల పాఠశాలలు మూసివేత

ఉమ్మడి జిల్లాలో దశాబ్దాల చరిత్ర ఉన్న ఎయిడెడ్ పాఠశాలలు మూతపడ్డాయి. ఈ జాబితాలో దక్షిణ భారతదేశంలో ... మిగతా 7వ పేజీలో

పాడేరు బీజేపీకే!

జనసేనకు పాలకొండ?

నాలుగు రోజుల్లో అభ్యర్థుల పేర్లు ప్రకటించే అవకాశం

- అరకులోయ పార్లమెంట్ పరిధిలో ఐదు టీడీపీకి, బీజేపీ, జనసేనకు చెరో సీటు



(పాడేరు- ఆంధ్రజ్యోతి)

అరకులోయ పార్లమెంట్ స్థానం పరిధిలోని పాడేరు, పాలకొండ అసెంబ్లీ స్థానాల ఉమ్మడి అభ్యర్థుల ఎంపిక వ్యవహారం ఒక కొలిక్కి వచ్చినట్టు తెలుస్తున్నది. కూటమిలో భాగంగా పాడేరులో భారతీయ జనతా పార్టీ, పాలకొండలో జనసేన పార్టీ అభ్యర్థులను బరిలోకి దించుతారని ప్రచారం జరుగుతున్నది. అయితే ఆ రెండు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులు ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. మరో నాలుగు రోజుల్లో పాడేరు, పాలకొండ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించాలనే ఆలోచనతో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలున్నారని తెలిసింది. దీంతో ప్రస్తుతానికి పాడేరు పాలకొండ అసెంబ్లీ స్థానాలను ఏ పార్టీకి కేటాయిస్తారనే దానిపై ఇన్నాళ్లుగా కొనసాగుతున్న ఉత్కంఠకు కొంత వరకు తెరపడింది.

అరకులోయ ఎంపీ పరిధిలో ఐదు అసెంబ్లీలు టీడీపీకే..

అరకులోయ అసెంబ్లీ స్థానం పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలకు ఐదు తెలుగుదేశం పార్టీకి, ఒక్కొక్కటి చొప్పున బీజేపీ, జనసేనకు కేటాయించారని తెలుస్తున్నది. అలాగే అరకులోయ ఎంపీ స్థానం బీజేపీకి కేటాయించగా... దాని పరిధిలోని రంపచోడవరం స్థానానికి మిర్యాల శిరీష, పార్వతీపురానికి బోనెల విజయ్, సాలూరుకు గుమ్మడి సంధ్యారాణి, కురుపాం తొయ్యాక జగదీశ్వరి, అరకులోయకు సియ్యారి దొన్నుదొరను తమ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. కాగా పొత్తులో భాగంగా అరకులోయ పార్లమెంట్ పరిధిలో పాడేరు ఎమ్మెల్యే స్థానాన్ని భారతీయ జనతా పార్టీకి, పాలకొండను జనసేనకు కేటాయించాని ఉమ్మడి పార్టీల నేతలు నిర్ణయించినట్టు తెలిసింది. అయితే ఆ రెండు స్థానాలకు అభ్యర్థులు ఎవరనేది ఇంకా ఖరారు లేదు. దానిపైనే బీజేపీ, జనసేన నేతలు కసరత్తు చేస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో తమ అభ్యర్థులను బీజేపీ, జనసేన ప్రకటించనున్నాయి.

పరిహారం.. పరిహాసమాయె!

జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయి రెండేళ్లయినా ఇప్పటికీ అందని పరిహారం

- అధికారులు మభ్యపెట్టి ఇళ్లు కూల్చివేశారని బాధితుల ఆవేదన
- న్యాయం చేయాలని రంపచోడవరం మండల ప్రజల వేడుకోలు



జాతీయ రహదారి నిర్మాణం కోసం కూల్చిన భవనాలు

రాజవొమ్మంగి, మార్చి 23: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు, ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన తమకు రెండేళ్లయినా ఇప్పటికీ పరిహారం అందలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్క నియోజకవర్గంలో నష్టపరిహారం చెల్లించిన తరువాతే గృహాలను తొలగించారని, తమకు మాత్రం అధికారులు మభ్యపెట్టి ముందుగానే ఇళ్లు తొలగించారని రంపచోడవరం నియోజకవర్గంలో రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం మండలాల ప్రజలు వాపోతున్నారు.

రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు జాతీయ రహదారి 516-ఈ నిర్మాణ పనులను ఇక్కడ 2022లో ప్రారంభించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో రోడ్డు వెంబడి ఉన్న ఇళ్లను, షాపులను కూల్చి వేశారు. అలాగే పోడు భూములను స్వాధీనం చేసుకుని రోడ్డు నిర్మాణం దాదాపుగా పూర్తి చేశారు. అయితే భూమి, ఇళ్లు, షాపుల యజమానులకు మాత్రం నష్టపరిహారం ఇంకా అందలేదు. దీనిపై ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎన్నిసార్లు కలెక్టర్, సబ్ కలెక్టర్‌లకు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది. పది రోజుల్లో మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడతాయని చెప్పడం తప్ప పడిన పాపాన పోలేదు. విసిగి వేసారిపోయిన బాధితులు గత నెలలో జడ్డంగి రోడ్డుపై బైఠాయించారు. నష్టపరిహారం చెల్లించాలంటూ ధర్నా చేశారు. జాతీయ రహదారి నిర్మాణ పనులకు వినియోగించే వాహనాలను ఆపివేయడంతో రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి డిప్యూటీ తహశీల్దార్ శ్రీధర్ వచ్చి 20 రోజుల్లో డబ్బులు వేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. అయితే ఈ సంఘటన జరిగి సుమారు నెల రోజులు అవుతున్నా నేటికీ నష్టపరిహారం సొమ్ములు పడలేదు. అయితే పక్క నియోజకవర్గంలో నష్టపరిహారం చెల్లించిన తరువాతే గృహాలను తొలగించారని, అయితే ఇక్కడ మాత్రం ప్రజలను మభ్యపెట్టి ముందుగానే ఇళ్లు తొలగించి, భూములు స్వాధీన పరుచుకున్నారని బాధితులు వాపోతున్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం మండలాల్లోని 32 గ్రామాల పరిధిలో బాధితులు ఉన్నారు. భూముల యజమానులకు సంబంధించి 70 శాతం మందికి నష్టపరిహారం చెల్లించారు. మిగిలిన వారికి ఇవ్వాల్సి ఉంది. ఇళ్లు, దుకాణాలకు ... మిగతా 8వ పేజీలో



జడ్డంగిలో ధర్నా చేస్తున్న బాధితులు (ఫైల్ ఫొటో)

క్షయతో మరణాలు సంభవిస్తే చర్యలు

- డీఎంహెచ్‌వో జమాల్ బాషా



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

హుకుంపేట, మార్చి 23: క్షయ వ్యాధితో మరణాలు సంభవిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా హెచ్చరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ముందుగా మందుల గదులను పరి శీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మండలంలోని 33 పంచాయతీల్లో ప్రజలకు క్షయ లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. క్షయ లక్షణాలు వచ్చి ఎవరైనా మృతి చెందారని తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. వైద్యం కోసం వచ్చిన రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. అంతకు ముందు మండల కేంద్రంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య వైద్య సిబ్బంది మహేశ్, సాంబశివరావు, సదానందం పాల్గొన్నారు.



విజయవాడ వర్క్‌షాపునకు టీడీపీ నేతలు



రానున్న ఎన్నికలకు అభ్యర్థులు, ఇన్‌చార్జులు, పరిశీలకులను సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం శనివారం విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించింది. వర్క్‌షాపునకు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అభ్యర్థులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, పల్లాశ్రీనివాసరావు, వంగలపూడి అనిత, ఎం.శ్రీభరత్, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, కేఎస్ఎన్ఎస్. రాజు, పైలా ప్రసాద్, దొన్నుదొర, కోళ్ల లలితకుమారి హాజరయ్యారు. ఇంకా పార్టీ నేతలు బుద్దా నాగజగదీశ్వరరావు, గండి బాబ్జీ, ప్రగడ నాగేశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, చోడే పట్టాభి, పుచ్చా విజయకుమార్, బొండా జగన్ తదితరులు పాల్గొన్నారు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

నేటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల అమ్మకం

ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్‌కు నేటి నుంచి ఆన్‌లైన్‌లో విక్రయం

- ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌కు ఈనెల 27 నుంచి...
- టికెట్ల ధరలు: రూ.1,000, 1,500, 2,000, 3,000, 3,500, 5,000, 7,500

- 7లో

బ్లాస్టింగ్ పనులతో బెంబేలు

జాతీయ రహదారి నిర్మాణం కోసం కొండల పేల్చివేత

- ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఎగిరి పడుతున్న బండరాళ్లు
- గ్రామంలో పడుతుండడంతో భీతిల్లుతున్న ప్రజలు
- పేలుళ్ల ధాటికి ధ్వంసమవుతున్న ఇళ్లు



కొత్తవలస గ్రామ సమీపంలో జాతీయ రహదారి పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ చేస్తున్న దృశ్యం

అరకులోయ, మార్చి 23: డుంబ్రిగుడ మండలం పోతంగి పంచాయతీ పరిధి కొత్తవలస గ్రామానికి అతి సమీపంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చేపడుతున్న బ్లాస్టింగ్ పనులతో గిరిజనులు బెంబేలెత్తిపోతున్నారు. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా కొండలను బ్లాస్టింగ్ చేయడంతో బండరాళ్లు ఎగిరి కొత్తవలస గ్రామ సమీపంలో పడుతున్నాయి. బండరాళ్లు పెంకుటిళ్లపై కూడా పడుతుండడంతో ఇళ్లు ధ్వంసమవుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. బ్లాస్టింగ్ వల్ల బండరాళ్లు గ్రామంలో పడుతున్నాయని కాంట్రాక్టరు, సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని, పైగా తమపై వాదనకు దిగుతున్నారని గ్రామస్థులు తెలిపారు. మోతాదుకు మించి మందుగుండును వినియోగించడం వల్లే బండరాళ్లు ఎగిరి పడుతున్నాయని చెబుతున్నారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో బ్లాస్టింగ్ చేయ డం వల్ల బండరాళ్లు గ్రామానికి సమీపంలో ఎగిరిపడ్డాయని, ఇళ్లు సైతం దెబ్బ తిన్నాయని గ్రామస్థులు తెలిపారు. దీనిపై కలెక్టర్, సబ్ కలెక్టర్ స్పందించి తమకు ఎటువంటి ప్రమాదం జరగకుండా చూడాలని వారు కోరుతున్నారు.



పేలుళ్లకు ఎగిరి వచ్చిన బండరాయిని చూపుతున్న గ్రామస్థులు



బ్లాస్టింగ్ ధాటికి ధ్వంసమైన పెంకుటిల్లు

ఆరుబయట చదువులు

గొందికోట ఎంపీ ప్రాథమిక పాఠశాలకు భవనం లేక ఇబ్బందులు

- దశాబ్ద కాలంగా పాకలోనే నిర్వహణ
- అది కూడా శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులకు తప్పని అవస్థలు



పాఠశాల భవనం లేక ఆరు బయట తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు, మార్చి 23: మండలంలోని యు.చీడిపాలెం పంచాయతీ గొందికోట గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు భవనం లేక ఆరుబయటే విద్యార్థులకు విద్యా బోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది. దశాబ్దం క్రితం ఏర్పాటైన ఈ పాఠశాలలో సుమారు 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు. ఈ పాఠశాలకు భవన సదుపాయం లేకపోవడంతో స్థానిక గిరిజనులు కర్రలతో పాక ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అందులోనే తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ఆ పాక కూడా ఇప్పుడు పూర్తిగా శిథిలమైంది. దీంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు చెట్ల కింద పాఠాలు చెబుతున్నారు. వర్షమొచ్చినా, ఎండకాసినా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి ఫలితం లేకపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పాఠశాలకు భవన సదుపాయం కల్పించాలని వారు కోరుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.12
సహరి (సోమ)	4.44

క్రైం... crime news

రైలు ఢీకొని బాలుడి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 23 : అనకాపల్లి-తాడి రైల్వేస్టేషన్ మధ్య రాజుపాలెం సమీపాన శనివారం గుర్తు తెలియని రైలు ఢీకొన్న సంఘటనలో సాలాపువానిపాలెం గ్రామానికి చెందిన సాలాపు రాహుల్ (16) మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ కె. శాంతారామ్ తెలిపారు. రాహుల్ ఉదయం జిమ్‌కు ఇంట్లోంచి బయలుదేరి వెళ్లి రైల్వే ట్రాక్ మీదుగా నడుచుకుని వెళ్తుండగా విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొందన్నారు. బాలుడిని 20 మీటర్ల వరకు ఈడ్చుకుని పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. బాలుడు పాలిటెక్నికల్ మొదటి సంవత్సరం విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు.

చెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడి మృతి

పాయకరావుపేట, మార్చి 23 : పట్టణ శివారులో శనివారం తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తూ జారిపడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ జోగారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేటలోని పాతపేటకు చెందిన గుర్ర్తి ఏసు(43) కల్లు గీత కార్మికుడిగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఉదయం పట్టణ శివార్లలోని శ్మశానం వద్ద ఉన్న తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తూ జారి కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు. జరిగిన సంఘటనపై ఏసు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

సబ్బవరం, మార్చి 23: సబ్బవరం-చోడవరం రోడ్డులో గంగిరెడ్డికాలనీ వద్ద ఈనెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం వేకువజామున మృతిచెందాడు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం శివారు గొర్లివానిపాలెం దరి గంగిరెడ్ల కాలనీకి చెందిన ధనకొండ రాజు ఈనెల 21న చోడవరం రోడ్డులో టీ తాగి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. దీంతో రాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని ఆరిలోవలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం వేకువజామున రాజు మృతి చెందాడని అతని భార్య శాంతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడికి భార్య శాంతి, నలుగురు పిల్లలు ఉన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దహన సంస్కారాలు నిమిత్తం రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

వీడిన మిస్టరీ

- మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీకి పాల్పడింది ఆయన కుటుంబ గురించి తెలిసిన వ్యక్తే
- అప్పులు తీర్చేందుకు చోరీకి ప్రణాళిక
- హైదరాబాద్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. తైనాల కుటుంబం గురించి బాగా తెలిసిన వ్యక్తే నిందితుడని పోలీసులు గుర్తించారు. అతడిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకొచ్చి విచారిస్తున్నారు. దీనికి సంబంధించి విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సమీపంలోని ఒక గ్రామానికి చెందిన యువకుడు కొన్నాళ్ల కిందట డాబాగార్డెన్స్ లలితానగర్‌లోని తైనాల విజయ్‌కుమార్ నివాసానికి వచ్చాడు. తైనాల బంధువుల పేర్లు ప్రస్తావించి వారంతా తనకు తెలిసిన వారేనంటూ మాటలు కలిపాడు. ఇంట్లో తైనాలతోపాటు ఆయన భార్య మాత్రమే ఉంటున్నారని గుర్తించాడు. తైనాల లేని సమయంలో ఇంట్లో దోపిడీ చేస్తే..తన అప్పులు తీరిపోతాయనుకున్నాడు. తన పథకం అమలు చేయడానికి తైనాల దినచర్యపై కొద్దిరోజులుగా నిఘా పెట్టాడు. ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తైనాల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ప్రతిరోజూ మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాత్రికి చేరుకుంటున్నట్టు గుర్తించాడు. ఈనెల 21న తైనాల ఎస్.కోటలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిపోవడంతో రాత్రి ఏడున్నర సమయంలో కత్తి పట్టుకుని ఇంట్లోకి చొరబడ్డాడు. తన ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు ముఖానికి మాస్క్, నెత్తిన టోపీ ధరించాడు. కిచెన్‌లో వంటచేస్తున్న తైనాల భార్య మెడపై కత్తిపెట్టి తాను చెప్పినట్టు వినకపోతే చంపేస్తానని బెదిరించాడు. బీరువాలోని బంగారం, నగదు తీసి ఇవ్వాలని చెప్పడంతో ఆమె ప్రాణభయంతో అలాగే చేశారు. నిందితుడికి అప్పు ఇచ్చిన వ్యక్తి అదే సమయంలో ఫోన్ చేశాడు. 'ఏడున్నరకు డబ్బులు తీసుకోవడానికి డాబాగార్డెన్స్‌కు రమ్మన్నావ్. నేను అక్కడే ఉన్నా. నువ్వు ఇంకా రాలేదేమంటూ' ప్రశ్నించాడు. దీనికి సమాధానంగా నిందితుడు...'అదేపనిలో ఉన్నా, వచ్చేస్తున్నా' అంటూ సమాధానం ఇచ్చాడు. తర్వాత బంగారం, నగదుతో ఇంటి నుంచి బయటపడ్డాడు. నడుచుకుంటూ డాబాగార్డెన్స్ రోడ్డులోకి వెళ్లి అక్కడ తాను బాకీ ఉన్న వ్యక్తికి తాను దోపిడీ చేసిన డబ్బులో కొంత ఇచ్చాడు. అక్కడ ఆటో ఎక్కి కాన్వెంట్ జంక్షన్ మీదుగా ఎన్ఏడీకి చేరుకున్నాడు. అక్కడ బస్సు ఎక్కి రాజమండ్రి వెళ్లి, అక్కడి నుంచి రైలులో హైదరాబాద్ వెళ్లిపోయాడు. అప్పటికే పోలీసులు నిందితుడి ఆచూకీని సీసీ కెమెరాల ఫుటేజీతోపాటు సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ ఆధారంగా గుర్తించారు. అతడిని ట్రాకింగ్ చేస్తూ ప్రత్యేక బృందం హైదరాబాద్ వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుంది. దోపిడీ చేసిన నగలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. నిందితుడిని నగరానికి తీసుకొచ్చి పోలీసులు విచారిస్తున్నట్టు తెలిసింది. ఆదివారం పూర్తి వివరాలను మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది.

ఎయిడెడ్

... 5వ పేజీ తరువాయి

తొలితరం విద్యా సంస్థలుగా పేరున్న నగరంలోని సీబీఎం హైస్కూల్, ఏవీఎన్ ఉన్నత పాఠశాల, సెయింట్ ఆంథోని పాఠశాలలతోపాటు వేలాది మందికి విద్యను అందించిన ఎస్‌ఈ రైల్వే హైస్కూల్, ఎన్ఏడీ స్కూలు, సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల, నర్సీపట్నంలో ఆర్‌సీఎం ఉన్నత పాఠశాల ఉన్నాయి. ప్రాథమిక, యూపీ పాఠశాలలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు ఐదు వేల మంది వరకు చదువుకునేవారు. ఇక్కడ పనిచేసే టీచర్లు, సిబ్బందిని విద్యా శాఖ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లకు బదిలీ చేశారు. ఆయా పాఠశాలలు మూతపడడంతో అక్కడ చదువుకునే పేద విద్యార్థులు చెల్లాచెదురయ్యారు. ఏవీఎన్, సీబీఎం, సెయింట్ ఆంథోనీ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు సమీపంలోని జీవీఎంసీ పాఠశాలల్లో చేరారు. కూతవేటు దూరంలో ఉన్న స్కూలు నుంచి మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు పిల్లలు వెళ్లాల్సి రావడంతో అప్పట్లో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇంకా జ్ఞానాపురంలో సెయింట్ పీటర్స్ బాయ్స్ స్కూలు మూసివేతతో కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ పాఠశాలకు, రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రైల్వే స్కూలు, మర్రిపాలెంలోని ఎస్‌ఈ రైల్వే స్కూలు మూతతో నాలుగు కిలోమీటర్ల దూరంలోని గోపాలపట్నం పాఠశాలకు విద్యార్థులు వెళ్లాల్సి వచ్చింది. కొద్దోగొప్పో స్తోమత ఉన్న కుటుంబాలు తమ పిల్లలను ఇంటికి సమీపంలో ఉన్న ప్రైవేటు స్కూళ్లల్లో చేర్పించుకోగా, పేద కుటుంబాలు దూరమైనా గత్యంతరం లేక ప్రభుత్వ పాఠశాలలకు పంపాయి. మరికొందరైతే పిల్లలను చదువు మాన్పించినట్టు ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసిన టీచర్ ఒకరు తెలిపారు. ప్రధానంగా బాలికలు చదువుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక భీమిలిలో సెయింట్ ఆన్స్ పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూతపడనున్నది. విద్యా రంగ అభివృద్ధికి గడచిన ఐదేళ్లగా తాము ఎంతో కృషిచేశామని వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. కానీ ఎయిడెడ్ విద్యా సంస్థలను విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. అనేకమంది చదువుకు దూరం అయ్యారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	102.00
లైవ్ ధర	122.00
విత్ స్కిన్	214.00
స్కిన్ లెస్	224.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చెక్ పోస్టుల వద్ద పక్కాగా తనిఖీలు

- ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలి
- పోలీసు అధికారుల సమీక్షలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో తనిఖీలు పక్కాగా జరగాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీసులు, కేంద్ర పోలీసు బలగాలతో కలిసి ఉమ్మడి ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసులు నిష్పక్షపాతంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమావళి అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం ఎన్నికల సందర్భంగా పోలీసుల విధులపై దిశా నిర్దేశం చేశారు. పోలీసు స్టేషన్‌ల పరిధిలో ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్టు కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష జరిపారు. సమావేశంలో ఏఎస్పీలు విజయ్‌భాస్కర్, సత్యనారాయణ, డీఎస్పీలు అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, భవ్య, ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు.



పోలీసు అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

ప్రశాంతంగా టెన్త్ భౌతిక శాస్త్రం పరీక్ష

అనకాపల్లి రూరల్, మార్చి 22 : జిల్లాలోని పదో తరగతి పరీక్షల్లో భాగంగా భౌతికశాస్త్రం పరీక్షను శనివారం నిర్వహించినట్టు డీఈవో వెంకటలక్ష్మి తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 21,258 మందికి 21,139 మంది హాజరు కాగా 119 మంది గైర్హాజరు అయినట్టు చెప్పారు. ఈ పరీక్షకు ప్రైవేటు విద్యార్థులు 1,617 మంది హాజరుకావాల్సి ఉండగా 1,229 మంది హాజరై 388 మంది గైర్హాజరు అయినట్టు తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 22,875 మంది హాజరుకావాల్సి ఉండగా 22,368 మంది హాజరై.. 507 మంది గైర్హాజరు అయినట్టు తెలిపారు.

'నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు'

అనకాపల్లి అగ్రికల్చర్, మార్చి 23 : వివిధ పంటలలో అధిక దిగుబడులు పొందేందుకు జిల్లాకు అనువైన, నాణ్యమైన విత్తనాలను రైతులు సమకూర్చుకోవాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. శనివారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉత్తమమైన రకాలను ఉపయోగించి పండించిన పంటల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్‌లో నువ్వులు, జనుము వంటి పంటలు ఆశాజనకంగా ఉన్నాయని తెలియజేశారు. ప్రస్తుత తరుణంలో పప్పుధాన్యాలు, నువ్వులు, జనుము పంటలకు మార్కెట్లో మంచి ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ ముకుందరావు, డాక్టర్ టి.శ్రీలత, డాక్టర్ డి. ఆదిలక్ష్మి, డాక్టర్ ఎం.విశాలాక్షి, డాక్టర్ డి. ఉమామహేశ్వరరావు, డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

నిందితులను గుర్తించడంలో క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ ముఖ్యం

- జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ

సబ్బవరం, మార్చి 23: నిందితులను గుర్తించడంలో పోలీసులకు, న్యాయవాదులకు క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ ముఖ్యమని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని అసకపల్లి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్-5.0 నేషనల్ లీగల్ కాంపిటేషన్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దర్యాప్తు అధికారి క్రైమ్ సీన్ అబ్జర్వేషన్‌లో నిందితులను గుర్తించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఇటువంటి పోటీలతో న్యాయ విద్యార్థులు విజ్ఞానం, నైపుణ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. కేసులు దర్యాప్తు, చట్టాన్ని అమలు చేయడంలో న్యాయ విద్యార్థులకు ఎస్పీ మురళీకృష్ణ అవగాహన కల్పించారు. వర్సిటీ లీగల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నందినీ సీపీ, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మి, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పిన్నింటి రవమణ, వర్సిటీ ఫ్యాకల్టీ మెంబర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.


జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణను సత్కరిస్తున్న లా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి. సూర్యప్రకాశరావు

ఉపమాక ఆలయానికి పోటెత్తిన భక్తులు


ఉపమాక ఆలయంలో బారులు తీరిన భక్తులు

నక్కపల్లి, మార్చి 23: మండలంలోని ఉపమాక క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. కల్యాణ వేంకటేశ్వరుడిని దర్శించుకోవడం కోసం దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. శ్రీవారి కల్యాణోత్సవాల్లో భాగంగా పాయకరావుపేట, నక్కపల్లి, గోకులపాడు, ఎస్.రాయవరం, వేంపాడు గ్రామాలకు చెందిన మహిళా బృందాలు చేసిన కోలాట ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. అన్నమయ్య కీర్తనలు, శివ, కేశవుల గీతాలకు చేసిన కోలాట ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. ఉపమాక ఆలయంలో శనివారం కల్యాణ వేంకటేశ్వరుడి సన్నిధిలో ప్రముఖ తెలుగు పండితురాలు డాక్టర్ గాయత్రీదేవి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఇందులో టీచర్ హండీ, గురుభవానీ రాంబాబు, సుంకర శ్రీను, తాతాజీ కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'పేట'లో వైసీపీ నేత ఇంట్లో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

- వలంటీర్లకు డబ్బులు పంచుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు
- వెంటనే వచ్చి తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్
- డబ్బులు దొరక్కపోవడంతో వెనుతిరిగిన స్క్వాడ్
- సమాచారం ముందుగా అందడంతో ఇంటి వెనుక నుంచి వలంటీర్లను పంపారని టీడీపీ నాయకుల ఆరోపణ

పాయకరావుపేట, మార్చి 23 : పాయకరావుపేట పట్టణంలో శనివారం వైసీపీ నాయకులు వలంటీర్లకు డబ్బులు పంచుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు అందడంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. పట్టణంలోని వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు ఇంట్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం జరుగుతుండగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చి తనిఖీలు చేసింది. వలంటీర్లకు డబ్బులు పంచుతున్నారని అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేశామని ఫ్లయింగ్ స్క్వాడ్ విజయలక్ష్మి తెలిపారు. దీనిపై ధనిశెట్టి బాబూరావు మాట్లాడుతూ కార్యకర్తల సమావేశం మాత్రమే ఏర్పాటు చేసుకున్నామని, దీనికి వలంటీర్లు ఎవరూ రాలేదని తెలిపారు. దీంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ ఇంట్లో తనిఖీ చేయాలని చెప్పడంతో బాబూరావు ఇంట్లోని గదులు, బీరువాలను తెరిచి చూపించారు. బాబూరావు ఇంట్లో వలంటీర్లు కనిపించకపోగా డబ్బులు కూడా దొరకలేదు. అనంతరం ఆమె పార్టీ నాయకులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి అనుమతులు లేకుండా పార్టీ సమావేశాలు పెట్టకూడదని, ఇక నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేసి వెళ్లిపోయారు. ఆమె వెంట పాయకరావుపేట పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్, పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు. ఇదిలావుండగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వస్తోందని ముందుగానే వైసీపీ నాయకులకు సమాచారం అందడంతోనే ధనిశెట్టి బాబూరావు ఇంటికి వచ్చిన వలంటర్లను ఇంటి వెనుక నుంచి పంపించి, డబ్బులు అధికారులకు కనిపించకుండా దాచేశారని పలువురు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా పట్టణంలోని లింగాలతోట కాలనీలోని ఓ వైసీపీ నాయకుడి ఇంట్లో శనివారం సాయంత్రం పలువురు వలంటీర్లతో నాయకులు సమావేశం ఏర్పాటుచేసినట్టు తెలిసింది. ఓటర్ల లిస్టులో పెన్షన్‌దారులతోపాటు వైసీపీ అనుకూలమైనవారి పేర్లు గుర్తించి జాబితాలు అందజేయాలని ఆదేశించినట్టు తెలుస్తోంది.


వైసీపీ నాయకుడి ఇంట్లో తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

750 మంది బైండోవర్

- రావికమతం, కొత్తకోట ఎస్‌ఐలు ధనుంజయనాయుడు, లక్ష్మణరావు

రావికమతం, మార్చి 23 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రావికమతం, కొత్తకోట పోలీసు స్టేషన్ల పరిధిలో 750 మందిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసిట్టు ఎస్‌ఐలు ధనుంజయనాయుడు, లక్ష్మణరావు శనివారం తెలిపారు. గత ఎన్నికల సమయంలో అల్లర్లకు ప్రేరేపించిన, చెడు ప్రవర్తన కలిగిన, సారా, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని, అలాగే, ఇరు పార్టీలకు చెందిన పలువురు నాయకులను బైండోవర్ చేసినట్టు చెప్పారు. వీరంతా ఎన్నికల నియమావళి ప్రకారం గ్రామాల్లో శాంతియుతంగా ఉండాలని, ఎటువంటి అల్లర్లకు కారకులు కాకూడదని వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ పాలనలో వ్యవస్థలన్నీ విధ్వంసం

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేష్

తుమ్మపాల, మార్చి 23 : బీజేపీ పాలనలోని దేశంలోని ప్రభుత్వ రంగ వ్యవస్థలన్నీ పూర్తిగా విధ్వంసమయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి. ఓబులేష్ అన్నారు. శనివారం రోటరీ కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికరంగాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలు నిలబడాలంటే కేంద్రంలోని బీజేపీని, రాష్ట్రంలోని వైసీపీని ఈ దఫా ఎన్నికల్లో ఓడించాల్సిందేనన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డికి అధికార కాంక్ష తప్ప మరేమి లేదన్నారు. ఎలాగైనా మరలా అధికారం చేపట్టాలని బూటకపు హామీలతో కార్మికులు, రైతులను మోసం చేసేందుకు తెగబడుతున్నారన్నారు. గత హామీలను జగన్మోహన్‌రెడ్డి కచ్చితంగా అమలు చేయాల్సిందేనన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రథమ మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి నాయకులు డాక్టర్ బుసిరాజు, అచ్యుతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, ఏఐటీయూసీ కన్వీనర్ వైఎస్ భద్రం, సమితి సభ్యులు గనిశెట్టి ఏసుదాసు, కోన లక్ష్మణ, ఎల్‌వీ రమణ, పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చేతులెత్తి సంఘీభావం తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నేటి నుంచి ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల అమ్మకం

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 23: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించి టికెట్ల అమ్మకాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరిగే మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ల విక్రయాలు పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్ ద్వారా ఉదయం 10 గంటల నుంచి చేపట్టనున్నట్టు ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం తెలిపింది. ఈనెల 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు టికెట్ల అమ్మకాలు ఈనెల 27 నుంచి జరుగుతాయని పేర్కొంది. టికెట్ల ధరలను రూ.1,000, రూ.1500, రూ.2000, రూ.3,000, రూ.3,500, రూ.5,000, రూ.7,500గా నిర్ణయించింది. కాగా, ఆన్‌లైన్ టికెట్లను మామూలు టికెట్లుగా మార్చుకునేందుకు నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, ఏసీఏ-వీడీసీఏ 'బి' గ్రౌండ్‌లో కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరిగే మ్యాచ్ టికెట్లు కొనుగోలు చేసినవారు ఈనెల 26 నుంచి, ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌కు ఆన్‌లైన్ టికెట్ పొందినవారు ఈనెల 27 నుంచి ఆయా కేంద్రాల్లో మార్చుకోవాలని స్పష్టం చేశారు. కాగా టికెట్ల ధరలు క్రీడాభిమానులలో నిరుత్సాహాన్ని కలిగిస్తున్నాయి. ప్రారంభ టికెట్ ధర రూ.1000 కావడంతో ఆలోచనలో పడుతున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

అచ్యుతాపురం రూరల్, మార్చి 23: మండలంలోని చోడపల్లి గ్రామ శివార్లలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.7వేల నగదును స్వాధీనంలో చేసుకున్నట్టు ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగినట్టు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలని ఆయన కోరారు.

సైన్స్ పరీక్షకు 18 మంది గైర్హాజరు

910 మందికి 892 మంది విద్యార్థులు హాజరు

పాడేరు రూరల్, మార్చి 23: మండల కేంద్రంలో శనివారం జరిగిన పదో తరగతి సైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో మండలంలోని 14 పాఠశాలలకు చెందిన 910 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 892 మంది వచ్చారు. మిగిలిన 18 మంది విద్యార్థులు పరీక్షకు రాలేదని డీఈవో పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఏపీఆర్‌లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో 200 మంది హాజరు కావాల్సి ఉండగా 199 మంది వచ్చారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 125 మందికి 123 మంది, తలారిసింగిలో 205 మందికి 203 మంది, శ్రీకృష్ణాపురంలో 195 మందికి 183 మంది, లోచలిపుట్టు కేంద్రంలో 185 మంది హాజరుకావాల్సి ఉండగా 184 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో-1 ఎస్.రామచందరరావు తెలిపారు.

వలంటీర్లు ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే తొలగిస్తాం

చింతపల్లి, మార్చి 23: గ్రామ వలంటీర్లు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘిస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ఎంపీడీవో వీరసాయిబాబు హెచ్చరించారు. శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు రాజకీయ పార్టీల సమావేశాలు, ర్యాలీలు, సభలకు దూరంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదన్నారు. రాజకీయ పార్టీలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు కలిగి ఉండరాదన్నారు. ఈ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. వలంటీర్ల కదలికలపై పంచాయతీ కార్యదర్శులు, ఎంసీసీ బృందం సభ్యులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థంతంగా అమలు చేయాల్సిన పంచాయతీ కార్యదర్శులు, ఎంసీసీ బృందాలు సకాలంలో స్పందించకపోతే ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంగోడిలో సిద్ధి సంఘమేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం రేపు

పాడేరు రూరల్, మార్చి 23: మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలో ఈశ్వరీయ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సిద్ధి సంఘమేశ్వరస్వామి ఆలయం, ధ్వజ స్తంభం ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తామని మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు తెలిపారు. స్థానిక మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం వారు ఆధ్యాత్మిక బృంద సభ్యులతో కలిసి ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, సిద్ధి సంఘమేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కొయ్యూరులో పూరిల్లు దగ్ధం

కొయ్యూరు, మార్చి 23: మండలంలోని కొయ్యూరు గ్రామంలో ప్రమాదవశాత్తు ఓ పూరిల్లు దగ్ధమైంది. బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గారే సూర్యకాంతం శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లింది. మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల సూర్యకాంత గృహంలో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా గృహం చుట్టూ మంటలు వ్యాప్తిచెందంతో స్థానికులు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. గృహం పైకప్పు, గోడలు, గృహసామగ్రి, రూ.80 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు కాలిపోయాయి. కట్టుబట్టలు మాత్రమే మిగిలాయని, సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి చేసింది.

అంధకారంలో జోలాపుట్టు జలాశయం

» అలంకారప్రాయంగా విద్యుత్ స్తంభాలు

» జలాశయ సిబ్బంది, పర్యాటకుల భయాందోళన



జలాశయంపై ఖాళీగా దర్శనమిస్తున్న విద్యుత్ స్తంభాలు

ముంచంగిపుట్టు, మార్చి 22: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు ప్రధాన జలాశయం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. అందరికీ వెలుగులు అందించేందుకు కీలక పాత్ర పోషించే ఈ జలాశయం చీకట్లో మగ్గుతోంది. దీంతో రాత్రి వేళల్లో పర్యాటకులు, పాదచారులు, జలాశయం సిబ్బంది భయాందోళన చెందాల్సి వస్తోంది.

మాచ్‌ఖండ్ జలాశయం పొడవునా ప్రాజెక్టు అధికారులు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వివిధ కారణాలతో కొన్ని బల్బులు మరమ్మతులకు గురయ్యాయి. అలాగే కొంత మంది ఆకతాయిలు రాళ్లతో కొట్టడం వల్ల కొన్ని బల్బులు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న బల్బుల స్థానంలో నూతన బల్బులు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ప్రాజెక్టు అధికారులు ఆ దిశగా కనీసం దృష్టిసారించడం లేదనే చెప్పాలి. దాని పర్యావసంగా ప్రాజెక్టు గత కొన్నేళ్లుగా చీకట్లోనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. జలాశయంపై విద్యుత్ వెలుగులు లేకపోవడంతో రాత్రి వేళల్లో పాదచారులు అటుగా వెళ్లాలంటే బయపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆ ప్రాజెక్టుకు కూడా రాత్రి వేళల్లో అటుగా ఎవరు వస్తున్నారో, ఎవరు వెళ్తున్నారో తెలియడం లేదు. దీంతో రక్షణ సైతం కొరవడిందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

మాచ్‌ఖండ్ జలాశయ ప్రదేశం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. ఎక్కడబడితే అక్కడ మందు సీసాలు, గుట్కా కవర్లు, పేక ముక్కలు దర్శనమిస్తున్నాయి. ఆ ప్రాజెక్టును చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి సైతం పర్యాటకులు వస్తుంటారు. ప్రదేశంలో విద్యుత్ వెలుగులు లేకపోవడం వలన భయంతో సాయంత్రం ఐదు గంటలు దాటిందంటే చాలు పర్యాటకులు ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంపై విద్యుత్ స్తంభాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఆ ప్రదేశంలో పెను ప్రమాదాలు జరగకముందే ప్రాజెక్టు అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది.

క్షయపై అప్రమత్తత అవసరం

వైద్యులు, నిపుణుల సూచన

మండలాల్లో అవగాహన ర్యాలీలు, మానవహారాలు



గూడెంకొత్తవీధిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



ముంచంగిపుట్టులో మానవహారం చేపట్టి క్షయపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, మార్చి 23: క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరమని వైద్యులు, నిపుణులు సూచించారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా వ్యాధిపై శనివారం అవగాహన కోసం మన్యంలోని పలు మండలాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ముంచంగిపుట్టు వారపు సంతలో విస్తృత ప్రచారం చేపట్టారు. సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీగా వెళ్లి నాలుగు రోడ్ల కూడలిపై మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు శ్యాంప్రసాద్ మాట్లాడుతూ క్షయపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని చెప్పారు. క్షయ వ్యాధిని అవగాహనతో అంతమొందించగలమని, క్షయ లక్షణాలు తెలిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, నిర్ధారణ జరిగితే అన్ని రకాల మందులు ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యాధిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సక్రమంగా మందులు వాడుతూ వైద్యుల సలహాలు సూచనలను పాటిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం కిలగాడ, లబ్బూరు వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లిలో...

చింతపల్లి, మార్చి 23: గిరిజన ప్రాంత ప్రజలు క్షయపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌వీ నగర్ వైద్యాధికారి రాజారవీంద్ర సూచించారు. మండల కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు క్షయపై శనివారం అవగాహన ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం కలిగి ఉంటే ఉమ్మి పరీక్ష చేయించాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు. క్షయ నివారణకు అత్యాధునిక చికిత్స అందుబాటులో ఉందన్నారు. మందులు క్రమంగా వేసుకోవడం వల్ల వ్యాధి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి పద్మప్రియ, లోతుగెడ్డ వైద్యాధికారి లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో...

సీలేరు, మార్చి 23: సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో క్షయ నివారణ చర్యలపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ప్రసన్నకుమార్, సందీప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మూడు వారాలకు మించి దగ్గు వస్తే వెంటనే పీహెచ్‌సీకి వెళ్లి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను చేయించుకోవాలని, క్షయ నిర్ధారణ జరిగితే ప్రభుత్వం ఇచ్చే మందులను ఆరు నెలల పాటు వాడాలని ఈ సందర్భంగా వైద్యులు సూచించారు. అనంతరం సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మానవహారం నిర్వహించి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అశోక్, నానాజీ, కిశోర్, చంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి: క్షయ నియంత్రణకు ప్రజలు ముందుకు రావాలని సప్పర్ల వైద్యాధికారి సందీప్ అన్నారు. శనివారం ప్రపంచ క్షయ దినోత్సవం పురస్కరించుకుని గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న కుమార్, పారా మెడికల్ ఉద్యోగులు అశోక్, నానాజీ, కిశోర్ చంద్ర, శివ పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

కేంద్ర టెలికాం సలహా మండలి సభ్యుడిగా రామకృష్ణ



పాడేరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర టెలి కమ్యునికేషన్ సలహా మండలి సభ్యుడిగా బీజేపీ నేత సల్లా రామకృష్ణను నియమిస్తూ సంస్థ డైరెక్టర్ దినేశ్‌చంద్ర శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త గ్రామానికి చెందిన సల్లా రామకృష్ణ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పార్టీలో చురుకైన పాత్ర పోషిషిస్తున్న ఆయనకు కేంద్ర టెలికాం సలహా సభ్యుడిగా నియమించడంపై బీజేపీ నేతలు కురసా ఉమామహేశ్వరరావు, పాంగి రాజారావు, పి.రవికుమార్, కూడా కృష్ణారావు, కురసా పార్వతమ్మ, తదితరులు హర్షం వ్యక్త చేశారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

చింతపల్లి, మార్చి 23: ముత్యాలమ్మ ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం నిర్వాహకులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, ఆలయ కమిటీ సభ్యుడు సుర్ల వీరేంద్ర, సర్పంచ్ దురియా పుష్పలత, జీసీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు హేమంత్‌కుమార్, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు గసాడి పద్మనాభం అమ్మవారిని దర్శించుకున్నారు.

25న ముత్యాలమ్మ జాతరపై సభ

చింతపల్లి, మార్చి 23: ఆదివాసీల ఆరాధ్యదైవమైన ముత్యాలమ్మ జాతర నిర్వహణపై ఈ నెల 25న ఆలయ ప్రాంగణంలో గ్రామసభ నిర్వహిస్తామని మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతర నిర్వహణపై గ్రామసభలో ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. అలాగే ఈ సభలో ఉత్సవ కమిటీని ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, వర్తక సంఘం, మోటారు, గిరిజన, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు సభకు హాజరుకావాలని ఆమె కోరారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి

ముంచంగిపుట్టు, మార్చి 23: ప్రలోభాలకు లొంగకుండా, బెదిరింపులకు భయపడకుండా ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విశ్వ ఫౌండేషన్ ఫౌండర్ యూనివర్స్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో ఆయన మన ఓటు-మన జీవితం అంటూ బ్యానర్ పట్టుకొని, మైక్ ప్రచారం చేపట్టారు. ఈ పోలీసు, ఎలక్షన్ సిబ్బందికి అందరూ సహకరించాలని, ఓటు వేసే సమయంలో ఎవరితోనూ గొడవ పడకూడదని, ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని వివరించారు. ఓటర్లను చైతన్యపరచాలనే ఉద్దేశంతోనే ఈ ప్రయత్నం చేస్తున్నట్టు ఆయన తెలిపారు.


తొమ్మిది గ్రామాల్లో బాలబడులు



విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు అందిస్తున్న దృశ్యం

జి.మాడుగుల, మార్చి 23: ఏజెన్సీలో జి.మాడుగుల, చింతపల్లి మండలాల్లో తొమ్మిది పీవీటీజీ గ్రామాల్లో బాలబడులు నిర్వహిస్తునట్టు రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి శ్రీను తెలిపారు. ఈ పాఠశాలల నుంచి ఏడాదికి 70 మంది విద్యార్థులను గురుకుల, ప్రతిభా పాఠశాలల్లో చేర్పిస్తున్నట్టు చెప్పారు. ఈ బాలబడులు నిర్వహణకు ఎన్‌పీసీ, శ్రీనివాస్ ఫార్మా, శారద మెటల్స్ వంటి పలు సంస్థల సహాయంతో పుస్తకాలు, దుస్తులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది భాస్కరరావు, నాగబాబు, చిన్నారావు, జగ్గరావు, రాధ, మోహన్‌బాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, మార్చి 23: రాజకీయ నాయకులు ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని తహసీల్దార్ టి.రామకృష్ణ సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీ సమావేశాలు, ర్యాలీ, సభలు నిర్వహించే సమయంలో కచ్చితంగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు క్యాంపెనింగ్ కోసం ఉపయోగించే వాహనాలకు సైతం రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలు, అభ్యర్థులు రూ.50 వేలకు మించి నగదును తీసుకు వెళ్లకూడదన్నారు. సీ-విజిల్, సువిధా, హెల్ప్‌లైన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించడం జరుగుతుందన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

నవగ్రహ విగ్రహానికి అభిషేకాలు

పాడేరు రూరల్, మార్చి 23: పురాతన శైవక్షేత్రం స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కొలువైన నవగ్రహ విగ్రహానికి భక్తులు శనివారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. దీంతో ఆలయం భక్తులతో రద్దీగా మారింది. శని త్రయోదశిని పురస్కరించుకుని శనివారం ఆలయ ప్రధాన అర్చకులు రామం పంతులు ప్రత్యేక పూజలను చేపట్టారు. ఉదయం నుంచి నవగ్రహ విగ్రహానికి పూజలు చేసేందుకు భక్తులు వందల సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలనాయుడు ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు.



వరల్డ్ ఓరల్ హెల్త్ డే సభలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

దంత పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవితం

» జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషా

పాడేరు రూరల్, మార్చి 23: దంత పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషా అన్నారు. వరల్డ్ ఓరల్ డే సందర్భంగా దంత పరిరక్షణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం డెంటల్ సర్జన్ హెపీ క్రిష్టియన్‌రాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దంత పరిశుభ్రతను పాటిస్తే అనేక రకాల వ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నోటి ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతీ దినం ఉదయం, రాత్రి గోరువెచ్చటి నీటితో నోరు పుక్కిలించాలని సూచించారు. ఈ సందర్భంగా సుండ్రుపుట్టు ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వంద మంది చిన్నారులతో పాటు పాఠశాల సిబ్బందికి దంత పరీక్షలను చేపట్టారు. చిన్నారులకు ఉచితంగా మందులతో పాటు టూత్ బ్రెష్‌లు, పేస్టులు, టంగ్ క్లీనర్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వమిత్ర, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పాడేరు రూరల్, మార్చి 23: బ్రిటీష్ పాలకుల గుండెల్లో నిద్రపోయిన స్వాతంత్ర్య ఉద్యమకారుడు భగత్‌సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ సూచించారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు మత్స్యరాజు, రమేష్, రాజుబాబు, నాయుడు, అనీల్, దేవదాస్, మల్లేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో కొనసాగుతున్న పొగ మంచు

పాడేరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మన్యంలో శీతాకాలాన్ని తలపించేలా పొగ మంచు ప్రభావం కొనసాగుతున్నది. వాతావరణంలోని మార్పులతో శనివారం ఉదయం సైతం జిల్లా కేంద్రం పాడేరు, పరిసర ప్రాంతాల్లో పొగ మంచు దట్టంగా కమ్ముకుంది. తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిదిన్నర గంటల వరకు పొగ మంచు కొనసాగింది. గత మూడు రోజులుగా ఉదయం వేళల్లో పొగమంచు అలముకోవడం, మధ్యాహ్నం ఎండ తీవ్రంగా కాయడం సహజమైపోయింది, దీంతో ఏజెన్సీలో ప్రస్తుతం శీతాకాలం, వేసవి కాలం అనుభూతిని మన్యం వాసులు చవిచూస్తున్నారు.

రైల్వే అండర్‌పాస్ ఏర్పాటు చేయరూ...

» పెద్దూరు గ్రామస్థుల విన్నపం



పెద్దూరుకు అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని రైల్వే అధికారికి వినతి అందిస్తున్న గ్రామస్థులు

అరకులోయ, మార్చి 23: అనంతగిరి మండలంలోని బొర్రా పంచాయతీ బొర్రాపెద్దూరు గ్రామస్థులు రైల్వే అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నామని, బొర్రా స్టేషన్ ట్రాక్‌కు అటువైపుగా ఉండడం, ట్రాక్ కింద నుంచి అండర్ పాస్ లేకపోవడంతో ప్రత్యక్ష నరకం చూస్తున్నామని వాపోయారు. ఈ మేరకు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సదాశివప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం బొర్రాస్టేషన్ వద్ద జరుగుతున్న డబ్లింగ్ పనుల పర్యవేక్షణకు విచ్చేసిన సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. గ్రామంలో ఉన్న సగం మంది బొర్రాగుహల్లో గైడ్స్‌గా పని చేస్తున్నారని, బొర్రా గుహలు తిలకించేందుకు విచ్చేసే ప్రతీ రైల్వే ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్ సమస్యపై పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకపోతున్నమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే అరకులోయ మండలం బొండాం పంచాయతీలోని బొండాం, రేగ గ్రామాలకు రైల్వే శాఖ వారు అండర్‌పాస్‌లను మంజూరు చేశారని, తమ గ్రామం పెద్దూరుకు అండర్‌పాస్ ఏర్పాటుచేసి రహదారి సౌకర్యం కల్పించాలని గైడ్స్ యూనియన్ అధ్యక్షుడు రాము, సింహాద్రి, రఘురాం, బ్రో సంస్థ ప్రతినిధి రాజు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై రైల్వే డీఆర్ఎం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సదాశివప్రసాద్ తెలిపారు.

వసతిగృహంలో జారిపడి విద్యార్థికి గాయాలు

వార్డెన్, వాచ్‌మన్ లేకపోవడంతో పీహెచ్‌సీకి తరలించిన సహచర విద్యార్థులు



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థి రామ్‌కుమార్

పెదబయలు, మార్చి 23: మండల కేంద్రంలోనిగిరిజన ఆశ్రమ పాఠశాల-2లో ఏడో తరగతిలో విద్యార్థి జర్సింగి రామ్‌కుమార్ శనివారం రాత్రి వసతిగృహం ఆవరణలో కాలు జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు గాయమై రక్తస్రావమైంది. ఆ సమయంలో వసతిగృహంలో వార్డెన్, వాచ్‌మన్, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో తోటి విద్యార్థులే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కాలినడకన తీసుకు వెళ్లారు. అక్కడ వైద్య సిబ్బంది విద్యార్థికి ప్రథమ చికిత్స అందించి మందులు అందజేశారు. సాయంత్రం భోజనం అనంతరం వార్డెన్ ఇంటికి వెళ్లారని, వాచ్‌మన్ వసతిగృహం సమయంలో లేరని విద్యార్థులు తెలిపారు. కాగా, ప్రహరీ గోడ కూడా లేని వసతిగృహంలో చీకటి పడినా వాచ్‌మన్, ఇతర సిబ్బంది లేకపోవడం దారుణమని స్థానిక వార్డు సభ్యుడు జీవన్‌కుమార్ పేర్కొన్నారు. అసలే గ్రామాల్లో అంతర్రాష్ట్ర దొంగలు పిల్లలను అపహరించుకుపోతున్నారన్న ప్రచారం జరుగుతుందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు చెబుతున్నా హాస్టల్ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఆయన అసహనం వ్యక్తం చేశారు.

పరిహారం.. పరిహాసమాయె!

... 5వ పేజీ తరువాయి

సంబంధించి పరిహారం ఇంకా అందలేదు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి నెలకొందని బాధితులు ఆవేదన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు. దీనిపై రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయ డీటీ శ్రీధర్ వివరణ కోరగా త్వరలో సొమ్ములు జమవుతాయని తెలిపారు.

సబ్ కలెక్టర్‌ను కూడా కలవనివ్వట్లేదు



జాతీయ రహదారి నిర్మాణంలో 80 సెంట్ల భూమి కోల్పోయాను. నాకు రూ.12 లక్షలు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదు. అనేక సార్లు రాజవొమ్మంగి తహసీల్దార్ కార్యాలయానికి, రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాను. అయితే రంపచోడవరంలో సబ్ కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తే అధికారులు కలవనివ్వకుండా డబ్బులు వేస్తామంటూ పంపించేశారు. ఇప్పుడు అడిగితే ఎన్నికల కోడ్ ఉంది రెండు నెలలు వరకు రావంటున్నారు.

-మిస్త్రి రాజేశ్వరి, బాధితురాలు

'తనిఖీల్లో ఏ ఒక్క వాహనానికి మినహాయింపు వద్దు'

చీడికాడ, మార్చి 23: చెక్‌పోస్టు వద్ద తనిఖీలు పక్కాగా నిర్వహించాలని, ఏ ఒక్క వాహనానికి మినహాయింపు ఇవ్వరాదని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కోనాం చెక్‌పోస్టును ఎస్ఐ జి.నారాయణరావుతో కలిసి శనివారం మధ్యాహ్నం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ముగిసే వరకూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకులైనా తనిఖీల్లో మినహాయింపు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ఉమా వాణిశ్రీతో కలిసి శిరిజాం, ఖండివరం, అప్పల రాజుపురం సచివాలయాలను తనిఖీ చేశారు.

'80 ఏళ్లు దాటితే పోస్టల్ బ్యాలెట్'

రోలుగుంట, మార్చి 23: కేంద్ర ఎన్నికల కమిషన్ ఎనభై సంవత్సరాలు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించిందని తహసీల్దార్ రవిచంద్ర తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల 80 ఏళ్లు దాటిన వారిలో నలభై నుంచి యాభై శాతంమంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటున్నట్టు ఎన్నికల కమిషన్ గుర్తించిందన్నారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంలో భాగంగా వారికి పోస్టల్ బ్యాలెట్ ఆప్షన్ ఇచ్చినట్టు వివరించారు. మండలంలోని అర్హులైన వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు

చీడికాడ, మార్చి 23 : మంచాల మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు కళాశాలలో ఉన్నట్టు చెప్పారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించి మే 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.